క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల: భూసమస్యలపై నిర్వహించే రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో నేటి నుంచి నిర్వహించే సదస్సులో భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

బొగ్గు టిప్పర్ బోల్తా..

కాటారం: తాడిచెర్ల నుంచి భూపాలపల్లి వైపుగా బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ సోమవారం మండలంలోని ధన్వాడ సమీపంలోని కిష్టంపేట స్టేజి వద్ద బోల్తాపడింది. కిష్టంపేట స్టేజి వద్దకు రాగానే టిప్పర్ ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేయబోయి అతివేగంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బోల్తాపడటంతో డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ అతివేగం, ఓవర్‌లోడ్ కారణంగానే టిప్పర్ బోల్తాపడినట్లు వారు పేర్కొన్నారు.

కేసు నమోదు

కాళేశ్వరం: మహదేవపూర్ గ్రామానికి చెందిన పోలం శ్యామల గత నెల 28న బయటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె భర్త పోలం మహేష్ మహదేవపూర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జేడీ మల్లంపల్లిగా ప్రకటించడం హర్షనీయం


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మల్లంపల్లి ప్రజలు, సాధన సమితి నాయకుల ఆకాంక్ష మేరకు మల్లంపల్లి మండలాన్ని జేడీ మల్లంపల్లి మండలంగా ప్రకటించడం హర్షనీయమని మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కను శాలువాలతో సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షను గౌరవించిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సబక నాగరాజు, చేలే నవీన్, సుజన్ కుమార్,, కంజా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పిల్లి అశోక్‌కు రూ.42,500లు, అంచూరి సతీష్‌కు రూ.40,500లు, బొమ్మెర శ్రీనివాస్‌కు రూ.37వేలు, పోలోజు శ్రీవాణికి రూ.31,500లు, పోశాల చంద్రమౌళికి రూ.29వేలు, బండి శ్యామలకు రూ.24వేలు, అల్లెపు శ్రీనుకు రూ.17,500ల విలువ గల చెక్కులను అందించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడిశెట్టి కోటి, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, చీకూర్తి రమేష్, అల్లాడి రాజేశ్వర్‌రావు, ఎస్‌కె.జాకీర్, భూస సాంబయ్య, వెంకటేష్, ఎల్లయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


దాడుల్లో పాల్గొన్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నూగూరు గ్రామ శివారుల్లోని గుడుంబా స్థావరాలపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. నూగూరు గ్రామ శివారుల్లో గుండుబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రెండువేల లీటర్ల బెల్లం పాకనం ధ్వంసం చేయడంతో పాటు 55 లీటర్ల నాటు సారను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రొబేషనరి ఎస్సైలు తిరుపతి రెడ్డి, అవినాష్, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: తహసీల్దార్ కార్యాలయంలో..



కాటారం: గ్రామపంచాయతీ కార్యాలయంలో..



టేకుమట్ల: ఎంపీడీఓ కార్యాలయంలో..



తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో..




కాళేశ్వరం: హరితహోటల్‌లో..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో, పలు పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. - సాక్షి నెట్‌వర్క్


భూపాలపల్లి రూరల్: జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


రేగొండ: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ శ్వేత


భూపాలపల్లి రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి


మల్హర్: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ రవికుమార్


టేకుమట్ల: పోలీస్‌స్టేషన్‌లో..


కొత్తపల్లిగోరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..


గణపురం: కేటీపీపీలో జెండా ఎగురవేస్తున్న సీఈ ప్రకాశ్


మొగుళ్లపల్లి: పోలీస్‌స్టేషన్‌లో..


భూపాలపల్లి అర్బన్: జెండాకు వందనం చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్ దిలీప్‌కుమార్‌నాయ్


కాటారం: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ నాగరాజు


మొగుళ్లపల్లిలో..


భూపాలపల్లి రూరల్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు


ర్యాలీ ప్రారంభిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయంలో జీఎం రాజేశ్వర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ, బోనాలు, పీరీలతో ధూంధాం పాటలతో నృత్యాలు చేస్తూ జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జీఎం, అధికారులు అమరవీరుల స్తూపానికి పూలవేసి నివాళులర్పించారు. సాయంత్రం మీలినియం క్వార్టర్స్‌లోని కాకతీయ స్టేడియంలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏరియా ఉత్పత్తి ఉత్పదకత వివరాలను వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మహిళలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ ర్యాలీలో అధికారులు కవీంద్ర, మారుతి, రాజు, శ్రావణ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సేవా సభ్యులు పాల్గొన్నారు.


జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న జీఎం

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

- ఏడీఏ శ్రీపాల్

కాటారం: వర్షాకాలం సాగులో భాగంగా రైతులు పంట పొలాల్లో నాణ్యమైన విత్తనాలు వేసుకొని అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నాణ్యమైన విత్తనం-రైతు నేస్తం అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో తయారు చేసిన డబ్ల్యూజీఎల్-962, పెసర విత్తనాలు ఎంజీజీ-385 రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వరి విత్తనం పదికిలోల బ్యాగ్ ధర రూ.50, పెసర విత్తనం మూడు కిలోల బ్యాగ్ ధర రూ.50 కి రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామానికి వరి 2 సంచులు, పెసర ఒక సంచి చొప్పున మొత్తం 90 సంచులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓలు దీపక్, అస్మ, రాజన్న, రైతులు పాల్గొన్నారు.


విత్తన సంచులు అందజేస్తున్న అధికారులు

హామీలు నెరవేర్చకుంటే రిలే నిరాహార దీక్షలు

కాటారం: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతామని మహాముత్తారం మండల బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. వెంటనే హామీలను నెరవేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్కిరెడ్డి నర్సింహారెడ్డి, సోమ శాంతకుమార్, మార్క రాముగౌడ్, వెలమరెడ్డి అనిల్‌రెడ్డి, చీకట్ల లింగయ్య, దేవేందర్, ముక్కెర నవీన్, బాపు, తిరుపతి, వెంకటస్వామి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ములుగు: ప్రతీ రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయూష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. యోగా భారతీయ సనాతన జీవన విధానం అని అన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతి రోజు కనీసం 20 నిమిషాలు యోగా చేయాలని అన్నారు. ఈ నెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయూష్ యోగా టీచర్స్ శ్రీగురు శివకృష్ణ, హరిత, డీవైఎస్‌ఓ తుల రవి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కొత్తపల్లి బాబురావు, జ్యోతి, రాజేందర్, జయ తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’పై ఆశలు

- సమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్న రైతులు
- కీలకంగా మారనున్న మోఖా సర్వే


మోఖా సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

మల్హర్: రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసకువచ్చిన భూ భారతితో తమ భూ సమస్యలు తీరుతాయని రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతుంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలు నిత్యం కొనసాగుతూనే ఉంటాయి. క్షేత్రస్థాయిలో వీటి పరిష్కారం దొరకడం కష్టమే.. ఇదే సమయంలో తెలంగాణ ఏర్పడ్డ అనంతరం భూముల సత్వర పరిష్కారానికి గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా భూములను ఆన్‌లైన్ చేసింది. ధరణి పేరుతో ఏర్పాటు చేసిన పోర్టల్‌లో లోపాల కారణంగా రికార్డులు సరిగా లేకపోవడంతో అనేక మంది రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా భూ భారతి పేరుతో నూతన పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చింది. గత పోర్టల్‌లో లేని అనేక అంశాలను చేరుస్తూ భూ సమస్యలను సత్వరంగా పరిష్కరించేలా రూపొందించారు. ప్రస్తుతం భూమి వివరాలు మాత్రమే అందుబాటులోకి రాగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చారు.

సమస్యల స్వాగతం..

నూతనంగా ఏర్పాటు చేసిన భూ భారతికి స్థానికంగా ఉన్న పెండింగ్ భూసమస్యలు సాదరస్వాగతం పలకనున్నాయి. రెవెన్యూ శాఖకు తప్ప ఇతర వ్యక్తులకు కనీస అర్థం కూడా తెలియని భూ వివరాలు సైతం అందరికీ తెలిసేలా నిర్వహణ చేపడుతున్నారు. అదే విధంగా గ్రామాల్లో సేత్వార్ (భూవిస్తీర్ణం) సమస్యలతో అర్హులైన అనేక మంది రైతులకు పట్టాలు లభించలేదు. మోకాపై ఉండి పంటలు పండిస్తున్నా పొలాలకు ఈ సేత్వార్ సమస్యతో వాటిపై యాజమాన్య హక్కులను మాత్రం కొందరు రైతులు పొందలేక పోతున్నారు. తాము సాగు చేసే భూ విస్తీర్ణం కన్నా తక్కువగా ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో సవరణ కోసం చేసుకున్న విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

కీలకంగా మారనున్న మోఖా సర్వే

సేత్వార సమస్యల కారణంగా మండల వ్యాప్తంగా చాలా భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యలపై నిర్వహించే రెవెన్యూ గ్రామ సభల్లో రైతుల నుంచి పెండింగ్ భూ సమస్యలపై ఆర్జీలు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో సేత్వార్, ఇతర సమస్యలతో పట్టాలకు నోచుకోని రైతులు నుంచి తీసుకున్నారు. ఆర్జీలను పరిశీలిన అనంతరం కొత్తగా ఏర్పడే జీపీఓలు, సర్వేయర్‌ల టీఎంతో త్వరలోనే భూమిని మోఖా సర్వే చేయనున్నారు. సర్వే రిపోర్టు, పత్రాలు ఆధారంగా సదరు సర్వే నంబర్‌లో అనర్హుల పేర్లను తొలగించి, అర్హుల పేర్లను రెవెన్యూ రికార్డులో అధికారులు నమోదు చేయనున్నట్లు తెలుస్తుంది. ఈ భూ భారతి పోర్టల్‌తో పెండింగ్ భూ సమస్యలపై వీలైనంత త్వరగా పరిష్కారం లభిస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే. ప్రస్తుతం అమలు అయ్యే భూ భారతిలో ఈ సమస్యలకు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ పరిధిలోనే ముగింపు పలికే అవకాశం ఉండటంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టా కాలేదు..



తాడిచర్ల శివారులోని సర్వే నంబర్ 1100లో ఎకరం భూమిని కొనుగోలు చేసిన రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. భూమి పట్టా కోసం ధరణిలో పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోని కాళ్లు ఆరిగేలా అధికారుల చుట్ట ప్రదక్షణలు చేశాను. ఆన్‌లైన్‌లో సేత్వార్ లేదనే కారణంతోధరణిలో నమోదు చేయలేదు. ఈ భారతిలోనైన నాకు నాయ్యం చేసి పట్టా ఇప్పించాలి.

- పెంచాల మల్లయ్య, తాడిచర్ల, మల్హర్

సమస్యలు పరిష్కరిస్తాం..



నూతన భూభారతి పోర్టల్ ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం. నేటి మంగళవారం నుంచి ఈనెల 17 వరకు గ్రామాల వారికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తాం. పెండింగ్ భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటాం. గ్రామ సభల అనంతరం 18 నుంచి ఈనెల 20 వరకు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను సైతం తీసుకుంటాం. రైతుల ఇచ్చిన ఆర్జీల ఆధారంగా రికార్డులు, భూ మోకా పరిశీలన అనంతరం భూ సమస్యలను పరిష్కరిస్తాం. రెతులు ఈ రెవెన్యూ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలి.

- రవికుమార్, తహసీల్దార్, మల్హర్

నేటినుంచి రెవెన్యూ గ్రామసభలు

భూపాలపల్లి రూరల్: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3న చికెనపల్లి, వజినపల్లిలో, 4న రాంపూర్, గూడాడ్‌పల్లిలో, 5న కమలపూర్, నేరేడుపల్లిలో, 6న కొత్తపల్లి(ఎస్‌ఎం)లో, 9న గోర్లవీడులో, 10న నాగారం, ఆజాంనగర్‌లో, 11న నందిగామ, పందిపంపులలో, 12న గొల్లబుద్దారం, దూదేకులపల్లిలో, 13 జంగేడులో, 16న పంబాపూర్, దీక్షకుంటలో, 17న పెద్దాపూర్, కొంపెల్లిలో, 19న భూపాలపల్లి, ఖీంఘన్‌పూర్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

మల్హర్: మండలంలో భూ భారతి రెవెన్యూ గ్రామ సభలను నేటి నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు టీమ్‌లుగా గ్రామసభలు కొనసాగుతాయని వెల్లడించారు. మంగళవారం తాడిచర్ల, దొమాలమాదారంలో. ఈనెల 4న మల్లారం, కాపురంలో, ఈనెల 5న చిన్నతూండ్ల, శాత్రాజ్‌పల్లిలో, ఈనెల 6న దుబ్బపేట, అన్సాన్‌పల్లిలో, 9న దబ్బగట్టు, నాచారంలో, 10న పెద్దతూండ్ల, తాడ్వాయిలో, 11న వల్లెకుంట, మల్లెంపల్లిలో, 12న కొండపేటలో, 13న ఎడ్లపల్లిలో, 16న రుద్రారంలో, 17న చిగురుపల్లిలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

‘అర్హులకు అందని ఇందిరమ్మ ఇళ్లు’

మంగపేట: ఇందిరమ్మ ఇళ్లు మండలంలో అర్హులకు అందలేదని అనర్హులకు మంజూరు చేశారని పలు గ్రామాల్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నర్సింహాసాగర్‌లో ప్రకటించిన లబ్ధిదారుల్లో సాగుభూములు, ఆస్తులు ఉన్నవారు ఉన్నారని వారి పేర్లను తొలిగించి గ్రామ సభల ద్వారా ఇళ్లు లేని అర్హులైన వారికి మంజూరు చేయాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా అకినేపల్లి మల్లారంలో ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూమి, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారిని లబ్ధిరులుగా ఎలా ఎంపిక చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాపై గ్రామల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి అనర్హుల పేర్లను తొలిగించి అర్హత కలిగిన నిరుపేదలను గుర్తించి మంజూరు చేయాలని కోరుతున్నారు.